ఆపరేషన్ చిరుత..

- కడియపులంక నర్సరీ ప్రాంతంలో సంచారం
- అటవీ అధికారుల అప్రమత్తం
- బంధించేందుకు 60 మంది ఫారెస్ట్ సిబ్బంది
- 20 ట్రాప్, 4 సోలార్ సీసీ కెమెరాలు, రెండు బోన్ల ఏర్పాటు
- ఆందోళనలో ప్రజలు


కడియపులంక నర్సరీలో చిరుత పాదముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు


చిరుత పాదముద్రలను కొలుస్తున్న సిబ్బంది


కడియపులంక నర్సరీలో ఏర్పాటు చేసిన బోను

రాజమహేంద్రవరం రూరల్/కడియం: చిరుత సంచారంతో కడియపులంక పరిసర ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్ చెరువు అభయారణ్యంలో కనిపించిన చిరుత.. అక్కడి నుంచి ఇక్కడకు వచ్చిందని అటవీ అధికారులు నిర్ధారణ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిరుత కదలికలు గురువారం కడియపులంక గ్రామం చెంతనే కనిపించాయి. చెక్కపల్లివారి వీధి ఎదురుగా గల ఓ నర్సరీలో చిరుత సంచరించినట్లు తెలిసింది. ఇళ్లకు సమీపంలో ఈ చిరుత ఉండడం ఆ ప్రాంత వాసులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనైనా చిరుతను బంధించాలని అటవీ శాఖ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

అటవీ సిబ్బంది అప్రమత్తం

తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల ఫారెస్ట్ అధికారులు ఎస్.భరణి, ఎంవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో 60 మంది ఫారెస్టు సిబ్బందితో ఈ ఆపరేషన్ జరుగుతోంది. దీని కదలికలు ఉన్న ప్రాంతంలో 20 ట్రాప్, నాలుగు సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే రెండు బోన్లను ఏర్పాటు చేసి వాటిలో చిరుతకు ఎరగా మేక, పంది పిల్లలను ఉంచారు. మూడు రోజులుగా ఈ చిరుత ఏ జంతువును చంపి ఆహారం తీసుకుందన్న ఆనవాళ్లు అధికారులకు ఎక్కడా కనిపించలేదు. దీంతో ఎట్టి పరిస్థితుల్లో ఈ రాత్రికి ఆహారం కోసం ఈ బోనులోకి వెళ్లి చిక్కుతుందనే ధీమాతో ఉన్నారు. కానీ ఇక్కడి నుంచి తప్పించుకుంటే మళ్లీ ఈ చిరుత కదలికలు గుర్తించి పట్టుకోవడం చాలా కష్టమవుతుందన్నారు. చిరుతను పట్టుకునేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

పనులకు దూరంగా నర్సరీ కూలీలు

నిత్యం వేల కూలీలతో కళకళలాడుతూ ఉండే నర్సరీలన్నీ వెలవెలబోతున్నాయి. చిరుత భయంతో పనులకు వెళ్లడానికి కూలీలు సాహసించడం లేదు. బుధవారం ఎవ్వరూ పనుల్లోకి వెళ్లవద్దని అధికారులు, నర్సరీ అసోసియేషన్ సభ్యులు ముందుగానే హెచ్చరించారు. అయితే గురువారం కొన్ని జాగ్రత్తలు తీసుకుని గుంపులుగా నర్సరీ పనులకు అనుమతించినప్పటికీ చాలామంది కూలీలు ఇంటికే పరిమితమయ్యారు.

నిలిచిన మొక్కల ఎగుమతులు

చిరుత భయంతో కూలీలు పనులకు రాకపోవడంతో అనేక రాష్ట్రాలకు మొక్కలు ఎగుమతులు నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే నర్సరీ వ్యవస్థకు తీరని నష్టం కలుగుతుంది. ఈ నేపథ్యంలో కూలీలు, నర్సరీ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీశాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. వాటిపై పోస్టర్లు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. అలాగే కడియపులంక సర్పంచ్ పాతంశెట్టి రాంజీ ఆధ్వర్యంలో గ్రామం అంతా మైకుల ద్వారా ముమ్మరంగా ప్రచారం చేపడుతున్నారు. ప్రజలు రాత్రిపూట ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం చిరుత ఉన్న ప్రాంతంలో ప్రజలు ఎవరు మైకులు పెట్టకుండా చిరుత చిక్కేవరకు జాగ్రత్త వహించాలని సర్పంచ్ రాంజీ సూచించారు. మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి సత్యప్రసాద్ కూడా గురువారం ఫారెస్ట్ అధికారులతో మాట్లాడారు.

పోటెత్తిన జనం

ఫారెస్ట్ అధికారులు ఎన్ని సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తున్నా ప్రజలు మాత్రం చిరుతను చూసేందుకు కడియపులంక పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. దీంతో అధికారులు విస్తుబోతున్నారు. చిరుత బోన్‌లో చిక్కాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇక్కడ ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరుతున్నారు. చిరుత కదలికలు ఉన్న ప్రాంతానికి ప్రజలు ఎక్కువగా వస్తే.. అక్కడి నుంచి బెదిరిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే కడియం మండలాన్ని ఆనుకుని ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు, మండపేట ప్రాంతాల ప్రజలను ఫారెస్టు అధికారులు అప్రమత్తం చేశారు. ఆ ప్రాంతంలో కూడా నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఈ రెండు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులు తగిన జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

క్లుప్తంగా

భోజనం, నిత్యావసరాల వితరణ


నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సర్వ్ విత్ హార్ట్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: సర్వ్ విత్ హార్ట్ స్వచ్ఛంద సేవాసంస్థ ఐదో వార్షికోత్సవాన్ని బొమ్మూరులోని లెప్రసీ కాలనీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి రోగులకు భోజనం వితరణ చేశారు. అలాగే నిత్యావసరాలను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు వేమగిరి ప్రశాంత్ కుమార్, సభ్యుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు, దాతల సహకారంతో నాలుగేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంస్థ సభ్యులు హుస్సేన్ రబ్బానీ, ఎం.రవీంద్ర, ఎల్ శ్రీనివాస్, ఫణి, శర్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి పరీక్షలు


విద్యార్థులతో మాట్లాడుతున్న చెకుముకి జిల్లా కన్వీనర్ రవిబాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యార్థులలో సైన్స్‌పై అభిరుచిని పెంపొందించడానికి, శాస్త్రీయ ఆలోచనలు కలిగించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతోగానో దోహదపడతాయని చెకుముకి జిల్లా కన్వీనర్ ఎస్.రవిబాబు అన్నారు. ఆనంద్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో సంబరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించామన్నారు. అక్టోబర్ ఒకటో తేదీన మండల స్థాయి పరీక్షలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు చెక్క తాతారావు, నిశ్చల్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి


సీతారాం ఏచూరి నివసించిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

కడియం: సీతారాం ఏచూరి గొప్ప పోరాట యోధుడని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. సీతారాం ఏచూరి బాల్యంలో జేగురుపాడులో ఆయన నివసించిన ఇంటిని గురువారం ఆయన సందర్శించారు. స్థానిక యూటీఎఫ్ నాయకుడు చిలుకూరి శ్రీనివాసరావు ఆ ఇంటి విశేషాలను వివరించారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి నేతగా, కమ్యూనిస్టు నాయకుడిగా, పార్లమెంటేరియన్‌గా అన్ని కర్తవ్యాలను విజయవంతంగా ఏచూరి నిర్వహించారన్నారు. బాధిత వర్గాల తరఫున వెలుగెత్తి చాటారన్నారు. ఆయన వెంట న్యాయవాది తోరాటి వసంతరావు, భగత్ సింగ్ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు బాలాజీ వరప్రసాద్, గోపాలకృష్ణారెడ్డి ఉన్నారు.

మత సమరస్యం కలిగిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్

ప్రకాశం నగర్: ఎక్కడా ఎటువంటి మత పరమైన విభేదాలు లేకుండా, మత సమరస్యం కలిగిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 28న తిరుమల శ్రీవారిని దర్శించుకుంటున్నారని ఆరోపించారు. టీటీడీ నిబంధనలకు కట్టుబడి అక్కడ అఫిడవిట్ ఇచ్చి దర్శనం చేసుకోవాలన్నారు.

ఆకుల వీర్రాజు పరామర్శ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ, బీసీ సంఘం నాయకుడు కడలి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు గురువారం పరామర్శించారు. రహమత్‌నగర్‌లోని కడలి వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన భార్య, కుమార్తెలతో మాట్లాడారు. ముందుగా కడలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోట న్నారు.

దంత వైద్య శిబిరం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఈ శిబిరం జరుగుతుందని, బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చట్టాలపై అందరికీ అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

ధవళేశ్వరం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు అన్నారు. ధవళేశ్వరంలోని జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ కల్యాణ మండపంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రీ అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశలలో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం, ఆంధ్రప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం తదితర అంశాలను వివరించారు. నిందితులను కస్టడీలోకి తీసుకునే ముందు, దానికి గల కారణాలను కచ్చితంగా నిందితుడికి, అతడి కుటుంబ సభ్యులకు తెలియపర్చాలన్నారు. అరెస్ట్ అయిన వ్యక్తికి విచారణ సమయంలో తనకు నచ్చిన న్యాయవాదిని కలిసే హక్కు ఉంటుందన్నారు. న్యాయవాది లేని సమయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను, ఉచిత న్యాయవాదిని పొందే హక్కు వారికి ఉందన్నారు. నోటీసు, అరెస్టు, చార్జ్ షీట్, విచారణ, రిమాండ్ తదితర ప్రతి దశలోనూ నిందితుడి హక్కులకు భంగం కలుగకుండా పోలీసు అధికారులు తమ విధులు నిర్వహించాలన్నారు. పోక్సో చట్టంలోని వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాడేరు అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీష్, రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎస్.భవ్య కిశోర్, రాజమహేంద్రవరం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహేష్, ధవళేశ్వరం సీఐ టి.గణేష్ పాల్గొన్నారు.

స్టిక్ మనోహర్‌కు జాదూ శిరోమణి అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ స్టిక్ మనోహర్

రాజమహేంద్రవరం సిటీ: అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన రాజమహేంద్రవరానికి చెందిన మెజీషియన్ డాక్టర్ స్టిక్ మనోహర్ జాదూ శిరోమణి అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలోని రాయ్ కేదార్నాథ్ ఆడిటోరియంలో ఇండియన్ బ్రదర్ హుడ్ ఆఫ్ మెజీషియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీలలో ఇంటర్నేషనల్ మేజిక్ ఫెస్టివల్‌ను జాదూ ఉత్సవ్ 2024 పేరుతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టిక్ మనోహర్‌కు జాదూ శిరోమణి అవార్డును ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా స్టిక్ మనోహర్ మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు మెజీషియన్లు తమ ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా కృషి చేయాలన్నారు. యువతలో దేశభక్తి పెంపొందించే విధంగా కూడా మేజిక్ అంశాలను ప్రదర్శించాలన్నారు.

తల్లీకుమార్తెలపై దాడి

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిని బలవంతంగా ఖాళీ చేయించడంతో పాటు తనను, కుమార్తెలపై దాడి చేసి గాయపరిచారని ఓ మహిళ బుధవారం రాత్రి బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. శాటిలైట్‌సిటీ బి బ్లాక్‌కు చెందిన గాలిదేవర లక్ష్మి తన కుమార్తెలు దూలం రమణ, ఆకుల నాగలక్ష్మితో కలిసి ధర్నాల రాధకు చెందిన ఇంటిలో అద్దెకు ఉంటుంది. ఆ ఇంటిని విక్రయిస్తామని రాధ చెప్పడంతో రూ.10.20 లక్షలకు బేరం కుదుర్చుకుంది. ఆరు నెలల క్రితం రూ.2.20 లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించింది. అయితే రాధ ఇంటిని వేరొకరికి అమ్ముతామని, ఇల్లు ఖాళీ చేయాలని లక్ష్మిని కోరింది. తమకు రెండు నెలలు సమయం కావాలని లక్ష్మి అడిగింది. అయితే ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో ధర్నాల రాధ, మురళి, బలగాల గోపి, బలగాల సావిత్రమ్మ ఆ ఇంటిలోకి ప్రవేశించి సామాన్లు పడేశారు. లక్ష్మి, ఇద్దరు కుమార్తెలపై దాడి చేశారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చిలకమర్తి జయంత్యుత్సవం


కడియంలో చిలకమర్తికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం సత్యనారాయణ తదితరులు

కడియం: సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రముఖ కవి, కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని గురువారం కడియం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ మాట్లాడారు. ముందుగా చిలకమర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో చిలకమర్తి చెప్పిన పద్యం ×భరత ఖండంబు చక్కని పాడియావ్వను గుర్తుచేశారు. తొలి తెలుగు హాస్య నవల గణపతి, గయోపాఖ్యానం నాటకం తదితర వాటిని రచించారన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు జి.శరత్ బాబు మాట్లాడుతూ సంఘ సంస్కరణలో కందుకూరికి చిలకమర్తి సహాయపడ్డారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిజ, కె.రాజు, తెలుగు క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బహుముఖ సంస్కరణవాది

ప్రకాశం నగర్: బహుముఖ సంస్కరణవాది చిలకమర్తి లక్ష్మీనరసింహం అని పీవీబీ సంజీవరావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పరిశోధన కేంద్రం, పురావస్తు శాఖ, ప్రదర్శనశాలల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చిలకమర్తి జయంతిని గురువారం వంకాయలవీధిలోని కందుకూరి గృహం లో ఘనంగా నిర్వహించారు. పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు మాట్లాడుతూ బ్రహ్మ, హితకారిణీ సమాజాలను పదమూడు సంవత్సరాల పాటు ఏకధాటిగా నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. సరస్వతి, మనోరమ, దేశమాత పత్రికల సంపాదకుడిగా ఆయన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమన్నారు. పల్లి సుధా మాట్లాడుతూ నిమ్నజాతుల కోసం తొలిసారిగా పాఠశాల స్థాపించిన ఘనత చిలకమర్తికే దక్కిందన్నారు. కార్యక్రమంలో చీరల సీతారామ నాయుడు, ఎండీ మోస పాల్గొన్నారు.

8 మోటారు సైకిళ్ల స్వాధీనం

కంబాలచెరువు: పలు ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను దొంగిలిస్తున్న ఇద్దరిని ఒకటో పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రాజమహేంద్రవరంతో పాటు రాజానగరం, దేవరపల్లి, గూడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల మోటారు సైకిళ్ల దొంగతనం జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. కాగా.. పోలీసులు నగరంలోని పీవీ నరసింహారావు పార్కు వద్ద పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆదెమ్మదిబ్బకు చెందిన దమ్ము దుర్గారావు, కృష్ణానగర్‌కు చెందిన గిడితూరి ప్రవీణసాయి మోటారు సైకిల్‌పై అటుగా వస్తున్నారు. వారిని ఆపి ప్రశ్నించగా అనుమానాస్పదంగా సమాధానాలు చెప్పారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి 8 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బాలీవుడ్ గాయకుడు హేమంత్‌కు నివాళి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాలీవుడ్ గాయకుడు హేమంత్ కుమార్ వర్ధంతి సందర్భంగా జిత్‌మోహన్‌మిత్ర అధ్యక్షతన గురువారం ఆయనకు నివాళులర్పించారు. స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా గుమ్మడి సమర్పణరావు, ఆత్మీయ అతిథులుగా పీవీఎస్ కృష్ణారావు, బి.సీతారామారావు, వి.జగపతి, జల్లి శివప్రసాద్, సుక్కిరెడ్డి శ్రీనివాస్, విశ్వనాథ్, ఏఎస్ ఆనంద్ విచ్చేశారు. జిత్‌మోహన్‌మిత్ర మాట్లాడుతూ హిందీ సినిమా సంగీత రంగంలో గర్వించదగ్గ గాయకులలో హేమంత్ కుమార్ ఒకరన్నారు. తన ఆర్కెస్ట్రా ద్వారా హేమంత్ కుమార్ పాటలు పాడే అవకాశం రావడం తన అదృష్టమని గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రముఖ గాయకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు సీహెచ్ విశ్వనాథ్‌ను హేమంత్ కుమార్ పురస్కారంతో జిత్‌మోహన్‌మిత్ర బృందం తరఫున సత్కరించారు.

క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటర్ పోటీలకు కాపవరం ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్ఎం పి.గోపాలకృష్ణారావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల చెందిన బసవ మల్లేశ్వరి, డొకుబుర్ర సౌజన్య ఈ నెల 24న మండపేటలో జరిగిన అండర్ 19 స్కూల్ గేమ్స్‌లో సెలెక్షన్లలో ప్రతిభ చూపారన్నారు. వచ్చే నెల ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు మన జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ చైతన్యను అభినందించారు. అలాగే గ్రామ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ మారెళ్ల భీష్ముడు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు రంగంపేట విద్యార్థులు

రంగంపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరిట జరుగుతున్న క్రీడా పోటీల్లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వి.పార్థసారథి తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం..

అండర్ – 14 బాలికల విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో డి.ప్రశాంతి ప్రథమ, జి.యామిని ద్వితీయ స్థానాలు సాధించారు. డిస్కస్‌త్రోలో డి.నాగలక్ష్మి (ప్రథమ), ఖోఖోలో డి.ప్రశాంతి, జి.యామిని, జి.ఉషశ్రీ, ఎస్.జాహ్నవి, డి. కీర్తనలు జిల్లాకు ఎంపికయ్యారు. కబడ్డీలో జి.నాగలక్ష్మి, వాలీబాల్‌లో వై.హర్షిత, యోగాలో డి.పూజిత, ఎం.సాహితి జిల్లా పోటీలకు అర్హత సాధించారు.

- అండర్–14 బాలుర విభాగంలో జి.ఆదినారాయణ 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచాడు. డి.దుర్గాప్రసాద్ డిస్కస్‌త్రోలో ప్రథమ, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానాలు, కబడ్డీలో డి.ఆదినారాయణ, జి.దుర్గాప్రసాద్ ప్రతిభ చూపారు.
- అండర్ – 17 బాలికల విభాగంలో కె.యవ్వనలక్ష్మి 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, కె.జాహ్నవి 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాలలో నిలిచి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. పి.హర్షిత జావెలిన్ త్రో, షార్ట్‌పుట్‌లలో ప్రథమ, కె.లక్ష్మీశ్రావ్య జావెలెత్రోలో ద్వితీయ, ఐ.దీపిక 400 మీటర్లు, 800 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానాలలో నిలిచారు.
- అండర్ – 17 బాలుర విభాగంలో పి.సన్నీ వరప్రసాద్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, చెస్‌లో జీవీఎస్ మణికంఠ, కబడ్డీలో పి.సన్నీ వరప్రసాద్, ఎస్.శ్రీనివాస్ జిల్లా పోటీలకు అర్హత సాధించారు.

జాబ్ మేళా.. జరిగిందంట..

- రాజానగరంలో నిర్వహణ
- సమాచారం ఇవ్వని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు
- ఆ ప్రాంగణంలోని అధికారులకూ తెలియని వైనం

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించామని ఆ సంస్థ అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ మేళాలో మూడు కంపెనీలు పాల్గొని, హాజరైన 64 మంది అభ్యర్థుల నుంచి 23 మందిని ఎంపిక చేశారని పేర్కొన్నారు. సాధారణంగా జాబ్ మేళాలు నిర్వహించే ఒకటి, రెండు రోజుల ముందుగానే విస్తృతంగా ప్రచారం ఇస్తారు. కానీ ఈ జాబ్ మేళా గురించి అదే ప్రాంగణంలో ఉన్న ఎంపీపీకిగానీ, ఎంపీడీఓకు, ఇతర శాఖాధికారులెవ్వరికీ తెలియకపోవడం విశేషం. ప్రాంగణంలో ఉన్న వారికే సమాచారం లేదంటే ఇక బయట ఉన్న నిరుద్యోగ యువతకు ముందుగా తెలిసే అవకాశమే లేదు.

భ్రమ కల్పించడానికేనా..

జాబ్‌మేళాలు నిర్వహించి, ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించామనే భ్రమను కలిగించే రీతిలో జాబ్ మేళా కార్యక్రమాలు ఉంటున్నాయని ఎంపీపీ మండారపు సీతారత్నం విమర్శించారు. గురువారం మధ్యాహ్నం వరకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లోనే ఉన్నానని, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టుగా కనీస సమాచారం కూడా లేదన్నారు. కాగితాలలో లెక్కలు చూపించి, ప్రభుత్వాన్ని మాయచేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టుగా భావించాల్సి ఉందన్నారు. నిజంగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశమే ఉంటే ఈ జాబ్ మేళా గురించి ముందుగా ప్రకటన విడుదల చేసేవారన్నారు. కనీసం మీడియాకు కూడా ఈ విషయాన్ని ముందుగా తెలియనివ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నిర్వహించిన జాబ్ మేళా ఓపెన్ ప్లేస్‌లో కాకుండా కామన్ ప్రొడక్షన్ భవనంలోని ఒక గదిలో నిర్వహించినట్టుగా వారు విడుదల చేసిన ప్రకటనలోని ఫొటోలను బట్టి తెలుస్తుందన్నారు. ఇంత రహస్యంగా ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆ శాఖ అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా ఇదే విషయమై ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా జాబ్ మేళా విషయం తనకు కూడా తెలియదన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ గోకవరం బస్టాండ్, దేవీచౌక్, రామచంద్రరావుపేట, కోర్లంపేట, ఎన్టీఆర్ కాలనీ, సీతంపేట, కృష్ణా నగర్, రామాలయం సెంటర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ స్పిన్నింగ్ మిల్ కాలనీ, బీఎస్ఎన్ఎల్ క్వార్టర్లు, శంకర్ విలాస్, ఫారెస్ట్ అకాడమీ, దూరదర్శన్, రామచంద్రరావు కాలనీ, బత్తిన నగర్, ఆల్కాట్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయిదుర్గానగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తారు.

80 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో బుధవారం రాత్రి 80 లీటర్ల సారా, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మూరు ఎస్సై అంకారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శాటిలైట్ సిటీ గొర్లి అప్పారావు తోట రోడ్డులో మోటారు సైకిల్‌పై ఇద్దరు సంచులతో వెళ్లడం గమనించామన్నారు. వారిని వెంబడించగా బండిని వదిలేసి పరారయ్యారన్నారు. ఆ రెండు సంచులలో 10 లీటర్ల చొప్పున 8 సారా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. పారిపోయిన వారిని హుకుంపేట డి బ్లాకుకు చెందిన దాసరి విష్ణు, పిడింగొయ్యి గ్రామానికి చెందిన మట్టా రాజుగా గుర్తించామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పందిరి మహాదేవుడు సత్రం ఈవోగా విశ్వనాథరాజు



రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పందిరి మహాదేవుడు సత్రం అసిస్టెంట్ కమిషనర్, ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పెన్మెత్స విశ్వనాథరాజు (శివ) గురువారం బాధ్యతలు చేపట్టారు. దీనితో పాటు తలుపులమ్మ లోవ దేవస్థానం ముఖ్య కార్య నిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల పర్యటన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు పరిశ్రమల సందర్శనలో భాగంగా విశాఖపట్నంలో పర్యటించారు. ముందుగా బీహెచ్ఈఎల్ కంపెనీని సందర్శించారు. దాని ఉత్పత్తి విభాగాలను, పనితీరును మేనేజర్ శాస్త్రి వివరించారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి వెళ్లారు. విశ్వవిద్యాలయ రెక్టార్ డాక్టర్ ఎన్.కిషోర్ బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.సునంద, డాక్టర్ బి.ప్రతిమ, వై.నాయుడు, వైపీ హరిత లోచన, టి.మణిరత్నం, ఎంటీ శబరీష్, ఆర్‌జీ ఫణీంద్ర కుమార్‌తో పాటు బీకాం (బీఐఎఫ్ఎస్) నుంచి 27 మంది, బీకాం (ఏటీ) నుంచి 23 మంది, బీబీఏ జనరల్ గ్రూప్ నుంచి పది మంది ఈ పర్యటనలో ఉన్నారు.

సమాచారం అప్‌డేట్‌గా ఉండాలి

కంబాలచెరువు: జిల్లాలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్ఎంటీలు తమ పరిధిలోని పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఎప్పుడూ అప్‌డేట్‌గా ఉంచుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. ఆయన గురువారం తమ కార్యాలయం నుంచి జిల్లాలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. స్వర్ణాంధ్ర 2047 అంశంపై జిల్లా స్థాయి పోటీలకు అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులను పంపాలన్నారు. టీచ్ టూల్ పరిశీలనలు నూరుశాతం పూర్తిచేయాలన్నారు. ప్రతి స్కూల్ ప్రొఫైల్ నిర్దేశిత ప్రొఫార్మాలో పూర్తిచేయాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్స్ పెంచేందుకు ప్రణాళిక పూర్తయ్యిందననారు. ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకుని దసరా సెలవులు పూర్తయ్యే సరికి గార్డెన్లు తయారయ్యేలా చూడాలన్నారు.

సినిమాలు



రాజమహేంద్రవరం

శ్యామల, సూర్యప్యాలెస్, సూర్యమినీ, శివజ్యోతి, స్వామి, అశోక, రాజా, రంభ, ఊర్వశి, మేనక, కుమారి, అప్సర : దేవర

నామవరం

వీఎస్ మహల్ : దేవర

ధవళేశ్వరం

మురళీకృష్ణ : దేవర

కడియం

వెంకటసూర్య : దేవర